సాక్షి మెదక్

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



తేలనున్న పరిహారం లెక్క

ట్రిపుల్‌ఆర్ భూసేకరణలో మరో ముందడుగు పడింది. అధికారులు భూములకు పరిహారం లెక్కలు తేలుస్తున్నారు. 10లో▸



మల్లన్నా.. ఇదేందయ్యా?

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అధికారులు, పాలకవర్గ సభ్యుల అవినీతి అక్రమాలు బయటకు రావడం జిల్లాలో చర్చనీయాంశమైంది. 10లో▸

నేడు ఐలమ్మ వర్ధంతి

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. పట్టణంలోని నర్సాపూర్–చేగుంట చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

శాంతి భద్రతలకు ప్రాధాన్యం



సమావేశమైన జిల్లాల డీఎస్పీలు

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో జరగబోయే ఎన్నికలకు సంబంధించి శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని పోలీసు అధికారులు అన్నారు. శనివారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన అంతర్ జిల్లా పోలీసుల సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి డీఎస్పీ జి.వెంకట్‌రెడ్డి, మెదక్ డీఎస్పీ ఫణీందర్, నారాయణఖేడ్ డీఎస్పీ బాలాజీ, అల్లాదుర్గం, నారాయణఖేడ్, జోగిపేట పరిధిలో సీఐలు, ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. అంతర్ జిల్లా పోలీసులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు జార్జ్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఎస్‌ఐలు బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, కోటేశ్వరరావు, షేక్ మహబూబ్, రాజయ్య తదితరులున్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

కొల్చారం(నర్సాపూర్): పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. శనివారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వినాయక చవితి, నిమజ్జనం కార్యక్రమాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌కు సూచించారు.

భోజనం బాగోలేదని విద్యార్థుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మధ్యాహ్న భోజనం, సాయంత్రం ఇచ్చిన సేమియా బాగోలేదని హాస్టల్ విద్యార్థులు ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌కు చెందిన విద్యార్థులు శనివారం రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. మధ్యాహ్నం భోజనం రుచిగా లేదని, సాయంత్రం ఇచ్చిన సేమియా నాసిరకంగా ఉందని ఆరోపించారు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి ఆగి వారితో మాట్లాడారు. వార్డెన్ నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, మెనూ పాటించడంలేదని, అడిగితే కొడుతున్నాడంటూ విద్యార్థులు చెప్పడంతో యూత్ సభ్యులతో కలిసి వంటగదిని, కూరగాయలను పరిశీలించారు. అనంతరం ఎఐస్ మాట్లాడుతూ.. సమస్యలుంటే తల్లిదండ్రులకు చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. ఘటనపై వార్డెన్ యాదయ్య మాట్లాడుతూ.. చక్కగా చదువుకోవాలని, ఉదయం త్వరగా లేవాలని చెబితే నచ్చని విద్యార్థులు తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు.

సాధన.. సాధ్యమెలా?

- తెలంగాణ క్రీడా మైదానాలపై నిర్లక్ష్యం
- ఆర్చ్‌లను పెట్టి వదిలేసిన అధికారులు
- పిచ్చిమొక్కలతో నిండిన ప్రాంగణాలు
- సామగ్రి ఉన్నా.. ఆడలేని పరిస్థితి



పిచ్చిమొక్కలతో నిండిన చిన్నశంకరంపేట మండలం జంగరాయి క్రీడాప్రాంగణం

మెదక్: గ్రామీణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. పెద్ద పెద్ద బోర్డులతో ఆర్చ్‌లను ఏర్పాటు చేసిన అధికారులు.. క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణను మరిచారు. గ్రౌండ్‌లో చదును చేయకుండా వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు పెరిగి మైదానం రూపురేఖలు మారాయి. ప్రాక్టీస్ కాదు కదా.. కనీసం అందులో కాలుపెట్టే పరిస్థితి లేకుండా పోయిందని క్రీడాకారులు వాపోతున్నారు. స్పోర్ట్స్ సామగ్రి అందుబాటులో ఉన్నా.. ఆటలు ఆడలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ క్రీడాప్రాంగణం పేరుతో ఈజీఎస్ ఆధ్వర్యంలో గతేడాది వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు అన్నిచోట్లా మైదానాలు నిరుపయోగంగా మారాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్థలంలో ఎకరం, అరెకరం, 20 గుంటలు, 10 గుంటలను కేటాయించింది. ఆటలకు అనువుగా చదును చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేసి గేట్‌ను ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు ఇవేం చేయకుండా స్థలం వద్ద కేవలం నేమ్ బోర్డును పెట్టి వదిలేశారు. చాలా గ్రామాల్లో ఈ క్రీడాప్రాంగణాలు ఊరికి దూరంగా ఉండడంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేసేందుకు దూరాభారంగా మారింది. కేటాయించిన స్థలంలో గుట్టలు, రాళ్ల కుప్పలు ఉన్నా.. వాటిని తొలగించకుండానే అధికారులు ఆర్చ్‌లను పెట్టి పూర్తయినట్లు రికార్డుల్లో నమోదు చేశారు.

మండలాల్లో ఇలా..

చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో పాఠశాల పక్కన ప్రహరీ ఆనుకుని నేమ్ బోర్డు మాత్రమే ఉంది. రుద్రారంలో వాటర్ ట్యాంకు పక్కన కూడా ఆర్చ్‌ని పెట్టి వదిలేశారు. శివ్వంపేట మండలం టిక్యాదేవమ్మగూడెం(తండా) తో పాటు చిన్నగొట్టిముక్కలలో ఆర్చ్ పెట్టి వదిలేశారు. కొల్చారం మండలం చిన్నఘనాపూర్‌లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం మూడు కిలోమీటర్ల దూరం ఉండడంతో నిరుపయోగంగా మారింది. సంగాయిపేట్ గ్రామంలో పెద్ద చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేశారు. చెరువు అలుగు పారితే అక్కడికి వెళ్లలేని పరిస్థితి. రంగంపేటలో క్రీడా ప్రాంగణం పక్కనే డంప్ యార్డ్, అంగన్‌వాడీ, జీపీ భవనాలతో ఇరుకుగా మారింది. రామాయపేట మండలం తోనిగండ్ల హనుమాన్ టెంపుల్ రోడ్డులో పొలాల వద్ద ఏర్పాటు చేశారు. పక్కనే రైతులు నాట్లు వేయటంతో ఆడలేని పరిస్థితి. నార్సింగ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని క్రీడా ప్రాంగణం వద్ద నేమ్ బోర్డు ఆర్చ్‌ని పెట్టి నిర్లక్ష్యంగా వదిలేశారు.

జిల్లాకే చేరిన సామగ్రి..

క్రీడలకు సంబంధించి గత నెల 15న సామగ్రి జిల్లాకు చేరినా, ఆడేందుకు సరైన మైదానం లేకపోవటంతో వాటిని పక్కన పెట్టారు. 469 గ్రామ పంచాయతీలకు గాను 578 స్పోర్ట్స్ కిట్లు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. క్రికెట్ కిట్, బ్యాట్లు, గ్లౌజెస్, ప్యాడ్స్, వాలీబాల్, కొలతల టేపులు, మూడు జతల డంబుల్స్, డిస్కస్ త్రో, నాలుగు స్కిపింగ్ రోప్స్, విజిల్స్, వాచ్‌లు, టీషర్టులు ఉన్నాయి. సామగ్రి సిద్ధంగా ఉన్నా.. ఆటలు ఆడేందుకు మైదానం లేక వాటిని పక్కన పెట్టారు.

ఆదేశాలు రాగానే పంపిణీ

జిల్లాకు 578 క్రీడా కిట్లు వచ్చాయి. ప్రాధాన్యత ప్రకారం అన్ని మండలాలకు అందిస్తాం. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఆదేశాలు రాగానే అన్ని గ్రామాలకు సరఫరా చేస్తాం. – నాగరాజు, జిల్లా యువజన క్రీడల అధికారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యుడు దేవయ్య

మెదక్ కలెక్టరేట్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు దేవయ్య, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) సమగ్ర శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య, కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. బాలలకు పాఠశాలల్లో శారీరక దండన విధించరాదని, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెదిలేలా ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన జరగాలని అన్నారు. బాలల హక్కుల రక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌సీపీసీఆర్ ప్రధాన శిక్షకుడు చిట్టిబాబు మాట్లాడుతూ.. ప్రతిజ్ఞ చేసే సమయాల్లో విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, క్రమశిక్షణతో నడుచుకునేలా నేర్పిస్తే ఉత్తమ పౌరులుగా మారుతారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ శిక్షకులు లతా మాధురి, జిల్లా విద్యాధికారి రాధా కిషన్, డైట్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ నీలకంఠం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా పట్టణం ఔరంగాబాద్ 1వ వార్డు పోలింగ్ స్టేషన్ పరిధిలో తన ఓటును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బీఎల్‌ఓకు దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓల వద్ద ఉన్న ఓటరు ముసాయిదాలో తమ పేరు ఉన్నదీ లేనిదీ ప్రతీ ఒక్కరు పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ నమోదుకు ఆన్‌లైన్, ఆఫ్ లైన్, హెల్ప్ లైన్ 1950ను ఉపయోగించుకోవాలన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. మహిళా, దివ్యాంగ, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్ల పేర్లను సమగ్రంగా పరీక్షించాలని ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లను సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ నవీన్, బీఎల్‌ఓ స్వాతి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రకటించకుంటే..

మెదక్ బంద్

పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ



మాట్లాడుతున్న మ్యాడం బాలకృష్ణ

మెదక్: అసెంబ్లీ వేదికగా మంత్రి హరీశ్‌రావు ప్రకటించినట్లు మెదక్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని, లేదంటే మెదక్ బంద్ నిర్వహిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన ఆయా జిల్లాలకు ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రకటించిందని, అందులో మెదక్‌ను చేర్చకపోవడం సరికాదన్నారు. ఈ నెల 15వ తేదీలోగా మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. మంత్రి హరీశ్‌రావు మెదక్ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, జిల్లాకు రావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలను సిద్దిపేటకు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. తక్షణం స్పందించకుంటే మంత్రి హరీశ్‌రావు మెదక్ రాకుండా అడ్డుకుంటామని అన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీలు ప్రసాద్‌గౌడ్, గొండ స్వామి, జిల్లా సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సాల్మన్, నాయకులు నవీన్ చౌదరి, నవీన్, బాల్‌రాజ్‌గౌడ్, కోటి రాజు, మధు, అనీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం వచ్చినా.. పట్టించుకోరా?

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు జ్వరం వచ్చిన ఇంటికి పంపకుండా ప్రిన్సిపాల్ కఠినంగా ప్రవర్తించడం సరికాదని ఎస్ఎస్ యూవి జిల్లా అధ్యక్షుడు హరీశ్‌వర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించారు. జ్వరంతో బాధపడుతున్న వరుణ్‌తేజ్‌ను ఆలస్యంగా ఇంటికి పంపడంపై అడిగి తెలుసు కున్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. జ్వరం వచ్చిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఆలస్యం చేయొద్దన్నారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీనిపై ప్రిన్సిపాల్ శివప్రసాద్‌ను వివరణ కోరగా.. విద్యార్థి అస్వస్థతకు గురికాగా ఏఎన్‌ఎం చికిత్స అందించామని, విద్యార్థి తండ్రి కోరితేనే ఇంటికి పంపామని, తమ పొరపాటు లేదన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న హరీశ్‌వర్ధన్



మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీశారద

18,876 కేసుల పరిష్కారం

- జిల్లా కేంద్రంలో జాతీయ లోక్ అదాలత్
- హాజరైన జడ్జి లక్ష్మీశారద, న్యాయవాదులు

మెదక్: చిన్న చిన్న గొడవలతో కేసుల్లో పెట్టుకొని కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం మెదక్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 18,876 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధితులకు రూ.54,45,200 బీమాను ఇన్సూరెన్స్ కంపెనీలు చెల్లించాయని, బ్యాంక్ కేసులకు సంబంధించి రూ.17,99,450 చెల్లింపులు జరిగాయన్నారు. జడ్జిలు జితేందర్, రీటా లాల్‌చంద్, కల్పన, సిద్దయ్య పాల్గొన్నారు.

నర్సాపూర్: మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ కమిటీ చైర్మన్ కె.అనిత పాల్గొన్నారు. రాజీ పడిన కేసులను పరిష్కరించారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఏపీపీ రాఘవేంద్ర, ఏజీపీ సత్యనారాయణ, న్యాయవాదులు జాఫర్, మధుశ్రీ, స్వరూపరాణి, శ్రీనివాస్‌గౌడ్, రాజనాయక్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్‌ఐలు షేక్‌లాల్ మధార్, శివకుమార్, శివప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులు, బ్యాంకు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బకాయి చెల్లింపులకు లైన్‌క్లియర్



లిఖితపూర్వక హామీ పత్రాన్ని చూపిస్తున్న కార్మిక యూనియన్ నేతలు

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి)లో గల ట్రిడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం, కార్మిక యూనియన్ నాయకుల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల్లో బకాయి వేతనాలు రూ.58లక్షల ఖాతాల్లో జమచేస్తామని, త్వరలో కొత్త ఒప్పందానికి స్పష్టమైన హామీవచ్చిందని కార్మిక నాయకుడు ఎంజీ రాములు తెలిపారు. కార్మికులను రీకాల్ చేసి విధుల్లోకి తీసుకుంటామని యాజమాన్య బాధ్యులు ఖిజర్, రాంనాథ్ రాత పూర్వకంగా హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఆర్ ప్రసాద్, ఫైనాన్స్ అకౌంటెంట్ శర్మ పాల్గొన్నారు.

చేరికలపై బీజేపీ నజర్

- నారాయణఖేడ్‌లో ఓ స్వామిజీని చేర్చుకునేందుకు ప్రయత్నాలు
- పటాన్‌చెరులోనూ చేరికలు ఉంటాయంటున్న కమలం నేతలు
- బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలకూ గాలం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో నాయకత్వ సమస్యను ఎదుర్కొంటున్న భారతీయ జనతా పార్టీ చేరికలపై దృష్టిసారించింది. ఒకవైపు అభ్యర్థిత్వాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగిస్తోంది. మరో వైపు ఆయా నియోజకవర్గాల్లోని ప్రత్యర్థి పార్టీలకు చెందిన నాయకులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. సంగారెడ్డి, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లోని ముఖ్యమైన నాయకులను చేర్చుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు చెందిన పులిమామిడి రాజు.. ఈటల రాజేందర్ సమక్షంలో కమలం పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. అలాగే నారాయణఖేడ్ నియోజకవర్గంలోనూ ఓ స్వామిజీని చేర్చుకోవాలని భావిస్తోంది. ఆయనకు ఈ ప్రాంతంలో వేల సంఖ్యలో భక్తులు ఉన్నారు. బీజేపీలో చేర్చుకోవడం ద్వారా రాజకీయంగా కలిసి వస్తుందనే రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు కూడా చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపీ బాగారెడ్డి కుమారుడు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న జైపాల్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి పార్టీలో చేరారు. ఇటీవల హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి సమక్షంలో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు మండలస్థాయి నాయకులూ చేరారు.

మురళీయాదవ్ చేరిక తర్వాత మళ్లీ ఇప్పుడు

రాష్ట్రంలో అధికారమే లక్ష్యమంటున్న కమలం పార్టీ ఆరు నెలల క్రితం నుంచే చేరికలపై దృష్టి సారించింది. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌ను చేర్చుకుంది. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో పెద్దగా చేరికలేవీ జరగలేదు. బీజేపీ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్ వీటిపై దృష్టి సారించినప్పటికీ, చెప్పుకోదగిన నేతలెవరూ ముందుకురాలేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు పార్టీ చేరికలపై నజర్ పెట్టింది. బీఆర్‌ఎస్‌లో టికెట్ ఆశించి భంగపడిన నాయకులను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

చంద్రశేఖర్ వీడాక

మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారైనట్లు సమాచారం. ఇలా బలమైన ఒకరిద్దరు నాయకులు పార్టీని వీడటంతో నిస్తేజంలో ఉన్న శ్రేణుల్లో.. నూతన చేరికలు కొంత మేరకు ఉత్సాహాన్ని నింపుతాయని అధిష్టానం భావిస్తోంది.

పర్మినెంట్ చేయాల్సిందే..

- సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద వినూత్న నిరసన

మెదక్ కలెక్టరేట్: విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే తమను రెగ్యులర్ చేయాలంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు వినూత్న నిరసనలతో ప్రభుత్వంపై పోరు సాగిస్తున్నారు. కలెక్టరేట్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ దీక్షలు చేస్తున్నారు. కేసీఆర్ చిత్ర పటానికి అభిషేకాలు, అర్చనలు, గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు, బతుకమ్మలు, సహస్ర పారాయణాలు నిర్వహిస్తూ రోజుకో తీరులో నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో శనివారం కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద సీఎం కేసీఆర్ బొమ్మను గీసి, ఉద్యోగులు చుట్టూ మానవహారంగా నిలబడి వర్షాన్ని కూడా లెక్క చేయకుండా నిరసన కొనసాగించారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో సమగ్ర శిక్షా పరిధిలో కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్పీ, ఎంఎస్ కోఆర్డినేటర్, ఐఈఆర్పీ, కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్, పీటీఐలు వివిధ కేటగిరిల్లో సుమారు 553 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిన సేవలు అందిస్తున్నారు. నియామక సమయంలో ఎగ్జామ్, ఇంటర్వ్యూ అనంతరం ఎంపిక చేసి, ప్రతిభ ప్రకారం నెలకు రూ.8,600 నుంచి రూ.19,500ల వేతన ఒప్పందం ప్రకారం ప్రభుత్వం చెల్లిస్తోంది. 2004 నుంచి ప్రారంభమైన సమగ్ర శిక్షాలో ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు ప్రవేశపెట్టిన ఉచిత పాఠ్యపుస్తకాలు ఉచిత నోట్స్ బుక్స్, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అమలు, మనబడి పనులు, బాల కార్మిక నిర్మూలన, దివ్యాంగ పిల్లలకు బోధన, స్వచ్ఛ పాఠశాలలు, హరితహారం లాంటి పథకాలు తమ కృషితోనే కొనసాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విలీనం చేయాలి



జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి. పనికి సమానం వేతనం అందించాలి.
– గట్టయ్య, సీఆర్పీ సంఘం జిల్లా అధ్యక్షుడు

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



ఏళ్లుగా కేజీబీవీలో పని చేస్తున్నా పనికి తగిన వేతనం అందడంలేదు. కనీసం ఉద్యోగ భద్రత లేదు. శ్రమ దోపిడీకి గురవుతున్నాం.
– కవిత, జేఏసీ జిల్లా అధ్యక్షురాలు, మెదక్

సర్కారు ఆదుకోవాలి



ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బీమా కల్పించి ఆదుకోవాలి.
– మంజుల, సీఆర్‌టీ, మెదక్

క్లుప్తంగా

రెండు ఆలయాల్లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని గుర్జ కుంట రేణుకా ఎల్లమ్మ ఆలయం, పాత దొమ్మాట రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రోజు మాదిరిగా ఆయా దేవాలయాల్లో పూజలు నిర్వహించే అర్చకులు శుక్రవారం రాత్రి దీపాలు వెలిగించి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చేసరికి ఆలయాల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఆయా గ్రామాల పెద్దల ద్వారా స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రూ.29,750 విలువగల బంగారు, వెండి ఆభరణాలు, నగదు.. రామాలయంలో రూ.15,750 విలువైన బంగారు, వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జల్సాలకు అలవాటై.. దేవాలయాల్లో దొంగతనాలు

దుబ్బాక: జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని దుబ్బాక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని శిలాజీనగర్ గ్రామానికి చెందిన మహేందర్, గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన ఓ మైనర్ వారం రోజుల క్రితం దుబ్బాక పట్టణంలోని శ్రీ బాలాజీ దేవాలయంతో పాటు మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలోని ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాల్లోని హుండీలను ఎత్తుకెళ్లారు. సీసీ పుటేజీ ఆధారంగా ఎస్ఐ నేతృత్వంలో పోలీసు ప్రత్యేక బృందం దొంగల కోసం గాలించారు. శనివారం ఉదయం చోరీలకు పాల్పడిన ఇద్దరిని వారి గ్రామాల్లో పట్టుకున్నారు. దీంతో ఇరువురిని కోర్టుకు తరలించారు. దొంగలను పట్టుకున్న ఐడీ పార్టీ కానిస్టేబుల్స్ రాంజీ, రాజిరెడ్డి, సాయి కృష్ణలను సీఐ మున్నూరు కృష్ణ అభినందించారు.

బైక్ ఢీకొని.. ఆశ వర్కర్‌కు తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో ఆశ వర్కర్ తీవ్రంగా గాయపడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ సైదన్న బుజ్జమ్మ భర్త నర్సింహులు బైక్‌పై వెళ్తుండగా దుర్గమ్మ గుడి సమీపంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బుజ్జమ్మ తలకు తీవ్రగాయాలు కాగా, నర్సింహులుకు స్వల్పగాయాలు అయ్యాయి. వారిని మెదక్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్‌ను బొలేరో వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. కుకునూర్‌పల్లి మండలం రాయవరంకు చెందిన కుక్కల పెద్దులు(47) శనివారం సాయంత్రం పని నిమిత్తం బైక్‌పై జగదేవ్‌పూర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ముందున్న లారీని తప్పించబోయి బైక్‌ను ఢీట్టింది. ప్రమాదంలో పెద్దులు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరిహారం లెక్క..తేలేది పక్కా!

- పెండింగ్ నోటిఫికేషన్ల విడుదలతో మొదలైన కసరత్తు
- మరో నెల రోజుల్లో భూసేకరణ ముమ్మరం
- ట్రిపుల్‌ఆర్ వ్యవహారంలో మరో ముందడుగు



రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం మ్యాపు

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్(రీజినల్ రింగు రోడ్డు) ఉత్తర భాగం భూసేకరణలో మరో ముందడుగు పడింది. భూసేకరణలో కీలకమైన త్రీడీ నోటిఫికేషన్ ఇప్పటికే చౌటుప్పల్, యాదాద్రి, ఆందోల్–జోగిపేట కాలా(కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)లకు విడుదల కాగా, కొన్ని రోజుల కిందట ఉమ్మడి మెదక్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్‌తోపాటు యాదాద్రి జిల్లా భువనగిరికి విడుదల చేశారు. దీంతో అధికారులు భూములకు పరిహారం లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు.

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) ట్రిపుల్‌ఆర్ భూసేకరణ పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. భూసేకరణను చేపట్టడానికి రెవెన్యూ డివిజన్ల వారీగా ‘కాలా’ను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇందులో భాగంగానే చౌటుప్పల్, యాదాద్రి, ఆందోల్–జోగిపేట పరిధిలో త్రీడీ నోటిఫికేషన్ విడుదలైన సంగతి కూడా తెలిసిందే. గజ్వేల్ కాలా పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుండగా, ఇక్కడ 17 గ్రామాల్లో, తూప్రాన్ పరిధిలో 14 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 8 గ్రామాల్లో, నర్సాపూర్‌లో 28 కిలోమీటర్ల జరగనున్న రోడ్డు నిర్మాణం కోసం 14 గ్రామాల్లో భూసేకరణ జరగ నుంది. ఇకపోతే భువనగిరి కాలా పరిధిలో 15 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరగనుండగా, ఆరు గ్రామాల్లో భూమిని సేకరించనున్నారు. మొత్తంగా ఎనిమిది కాలాల పరిధిలోని 84 గ్రామాల్లో 4,700 ఎకరాల వరకు భూసేకరణ జరగనుండగా... అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలను సేకరించను న్నారు. ఉత్తర భాగం రీజినల్ రింగు రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు కాగా.. ఇందులో 100 కిలోమీటర్ల వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనుంది. ఆయా కాలాలకు సంబంధించిన త్రీడీ నోటిఫికేషన్లను ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖలు ఇటీవలె ఆమోదించాయి.

అధికారులు బిజీ..

పెండింగ్‌లో ఉన్న ఐదు కాలాలకు త్రీడీ నోటిఫికేషన్ల విడుదలతో అధికారులు ఇక ఆయా కాలాల పరిధిలోని భూములకు పరిహారం లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా భూముల విలువలను లెక్కలు వేస్తున్నారు. ఈ లెక్కలు వాస్తవికతకు దగ్గరగా ఉండేలా క్షేత్రస్థాయి పరిశీలనలు సైతం జరుపుతున్నారు. వీటితోపాటు సర్వే నెంబరు, రైతు పేరు, భూసేకరణ జరుగనున్న విస్తీర్ణం తదితర అంశాలు సైతం అధికారికంగా సమగ్రంగా తెలియజేయడానికి కసరత్తు జరుగుతుంది. ఇదంతా నెల రోజుల్లో పూర్తికానుంది. ఇది పూర్తయితే భూసేకరణ వేగం పెంచే అవకాశం ఉంది. భూసేకరణ కొలిక్కి వస్తే మార్చి 2024లోగా పనులు ప్రారంభించే సంకల్పంతో ఎన్‌హెచ్ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) ముందుకుసాగుతోంది.


భూసేకరణ వేగవంతం

ట్రిపుల్ ఉత్తర భాగంలో పెండింగ్‌లో ఉన్న గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్ తోపాటు భువనగిరి కాలాలకు సంబంధించిన త్రీడీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. దీంతో ఆయా కాలా పరిధిలో సేకరించనున్న పరిహారం లెక్కలు తేలనున్నాయి. దీని తర్వాత భూసేకరణ వేగవంతం కానుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ వేగంగా సాగుతోంది.

– రాహుల్, ఎన్‌హెచ్ఏఐ డిప్యూటీ మేనేజర్

గజ్వేల్‌కు రూ.75 కోట్ల నిధులు


- పెండింగ్ పనులు పూర్తికి మరో రూ.18.77కోట్లు
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలో కుల సంఘాలు, మహిళా సంఘాలు, ప్రాథమిక పాఠశాలల భవనాలు, ఫంక్షన్ హాల్ నిర్మాణాలతో పాటు ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలబెట్టడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని కొనియాడారు. కొత్త పనులతో పాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్నవి పూర్తి చేయడానికి సైతం రూ. 18.77కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. వీటి విడుదలకు సహకరించిన మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు.

ఆన్‌లైన్ జాబ్ అంటూ సైబర్ వల

మోసపోయిన ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు, ఓ గృహిణి



పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో చిక్కుకుని ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు, ఓ గృహిణి మోసపోయిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 11వ తేదీన ఆన్‌లైన్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. పెట్టిన నగదుకు కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. పలు దఫాలుగా రూ.లక్ష 40 వేలు పెట్టాడు. అనంతరం నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి.. శనివారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గృహిణి..

అమీన్‌పూర్ పరిధిలోని ఇక్రిసెట్ కాలనీకి చెందిన ఓ గృహిణికి జూన్ 28వ తేదీన ఆన్‌లైన్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. దానికి ఆమె స్పందించి వివరాలు నమోదు చేసింది. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా రూ.47 వేలు ఇన్వెస్ట్ చేసింది. గృహిణి పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితురాలు తను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ ఇస్తామని...

అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఆగస్టు 18వ తేదీన రూ.5 లక్షల లోన్ ఇస్తామని ఒక మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేశాడు. అనంతరం లోన్ మంజూరు కోసం రూ.39 వేలు చెల్లించాలని చెప్పడంతో బాధితుడు చెల్లించాడు. తిరిగి లోన్ ప్రాసెస్ కోసం మరల నగదు చెల్లించాలని చెప్పడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించాడు. ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడి భార్యకు ప్రసవం


డాక్టర్ శ్రీధర్ భార్య షర్మిలకు శిశువును అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వసుంధర

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం అంటేనే ప్రజలు భయపడతారు. ఇక్కడి వైద్యంపై ప్రజలకు నమ్మకం ఉండదు. అక్కడ ప్రసవాలకు రావాలంటేనే గర్భిణులు జంకుతారు. ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రులకే ప్రాధాన్యతనిస్తారు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మెరుగైన చికిత్స అందుతుందనే నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో ఓ ప్రభుత్వ వైద్యుడు కీలక నిర్ణయం తీసుకున్నాడు. గర్భిణి అయిన తన భార్యను డెలివరీ కోసం తను పని చేస్తున్న ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చాడు. అక్కడ ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వసుంధర మాట్లాడుతూ.. పటాన్‌చెరు ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్టు శ్రీధర్ ఏడాదిన్నరగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గర్భిణిగా ఉన్న తన భార్య షర్మిలను తాను విధులు నిర్వర్తించే ఆస్పత్రిలో శనివారం చేర్పించినట్లు పేర్కొన్నారు. షర్మిలకు సిజేరియన్ అనంతరం ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్న అత్యాధునిక సేవలను వినియోగించుకోవాలని మంత్రి హరీశ్‌రావు చెప్పడం, వైద్యులు కూడా తమ కుటుంబ సభ్యులను చేర్పించి ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కలిగిస్తున్నారని అన్నారు. గతంలో తనకు కూడా అనారోగ్యానికి గురైతే పనిచేసే ఆస్పత్రిలో వారం రోజులు అడ్మిట్ అయ్యి చికిత్స చేయించుకున్నట్లు వసుంధర గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ప్రవీణ, గైనకాలజిస్టులు ప్రియదర్శిని, శ్రీవాణి, అనెస్తీషియా వైద్యురాలు శ్రీలత, సిబ్బంది రాజేశ్వరి, శ్రీదేవి ఉన్నారు.

చిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దు


గజ్వేల్ కోర్టులో నిర్వహిస్తున్న లోక్ అదాలత్

గజ్వేల్‌రూరల్: రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, గజ్వేల్ ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా గజ్వేల్‌కోర్టులో శనివారం క్రిమినల్, బ్యాంకు తదితర 931కేసులను పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ.. చిన్న సమస్యల కారణంగా కక్షలు పెంచుకోవద్దన్నారు. కేసులు పెట్టుకుని విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, అసిస్టెంట్ పీపీ విజయసుధ, దేశబోయిన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నా.. ఇదేందయ్యా?

- ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు
- కొరవడిన ఆలయ ఈఓ పర్యవేక్షణ
- పాలక సభ్యుల ఇష్టారాజ్యం


ఆలయం ఈఓ బాలాజీతో వాగ్వాదానికి దిగిన వాలంటీర్లు

టకొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో అధికారులు, పాలకమండలి మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయని ఆలయంలో జరుగుతున్న తాజా పరిణామాలను బట్టి తెలుస్తుంది. కొద్ది రోజులలో పాలక మండలి పదవీ కాలం ముగియనుండడంతో ఆలయంలో జరుగుతున్న పరిణామాలపై స్థానికంగా చర్చలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల నుంచి ఆలయంలో జరిగిన అవినీతి బయటకు రాకుండా పాలక మండలి, అధికారులు జాగ్రత్త పడినా చివరి సమయంలో ఒక్కొక్కటి బయటకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రసాద విక్రయశాలలో పులిహోర ప్రసాదం సుమారు 6200 ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయని, వాటి విషయంలో రూ1,25,200 గోల్‌మాల్ జరిగినట్లుగా పాలక మండలి చైర్మన్ ఆలయ ఈఓతో ప్రసాద విక్రయశాలలో పనిచేసే ఉద్యోగికి మెమో ఇప్పించినట్లు సమాచారం. ఉద్యోగి మాత్రం ఆలయ పాలక చైర్మన్ చెబితేనే ఇటీవల జరిగిన ఎమ్మెల్యే సమావేశానికి 1500 పులిహోర ప్యాకెట్లు, క్యూ కాంప్లెక్స్ భూమి పూజ రోజు సుమారు 4000 ప్యాకెట్ల భక్తులకు ప్రసాదంగా ఇచ్చామని, మిగతా రెండు వేల ప్యాకెట్లు నాలుగు నెలల నుంచి వీఐపీలకు ఇచ్చినట్లు తెలుపుతున్నారు. పాత బుకింగ్ కార్యాలయం కూల్చగా వచ్చిన ఇనుప సామానును కొంత మంది పాలక మండలి సభ్యులు టెండర్ లేకుండానే విక్రయించి ఆలయంలో జమ చేయనున్నట్లు సమాచారం. అదే విధంగా ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకంలో అధికారులు, పాలక మండలి చైర్మన్ మధ్య విభేదాలు తలెత్తడంతో కొంతమంది వాలంటీర్లు పెట్రోలు పట్టుకొని ఆలయ ఈఓ వద్ద నిరసన తెలపడం కొసమెరుపు. తాజా పరిణామాలకు కారణం ఆలయ ఈఓ పర్యవేక్షణా లోపమే కారణమని సమాచారం.

ఆలయ ఈఓ బాలాజీ హైదరాబాద్, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో రెండేళ్లుగా ఇంచార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయన వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఆలయానికి వస్తారు. దీనిని ఆసరాగా చేసుకొని ఆలయ ఉద్యోగులు, పాలక మండలి సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికంగా భక్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆలయ ప్రతిష్ట దెబ్బతినకముందే దేవాదాయ శాఖ అధికారులు స్పందించి రెగ్యులర్ ఈఓను నియమించాలని కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు చేపడతాం



ఆలయంలో వస్తున్న పలు అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. వారు ఎంతటి వారైన శాఖా పరమైన చర్యలు చేపడతాం.

– బాలాజీ, ఆలయ ఈఓ

కూతుళ్లకు ఆస్తులు ఇవ్వలేకపోయానని..

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య


పద్మాకర్‌రెడ్డి (ఫైల్)

తొగుట(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులు, కూతుళ్లకు ఏ ఆస్తులు ఇవ్వలేకపోయాననే బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, తొగుట ఎస్ఐ లింగం తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన కొమ్మెర పద్మాకర్ రెడ్డి కుటుంబం కొంత కాలంగా హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు గ్రామంలోని వ్యవసాయ భూమిని విక్రయించాడు. అదికాస్త వివాదాస్పదం కావడంతో సకాలంలో చేతికి డబ్బులు అందలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురైన పద్మాకర్ రెడ్డి రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. ఇద్దరు కూతుళ్లకు ఎలాంటి ఆస్తులు ఇవ్వలేకపోయానంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఉత్తరాలు రాసి పెట్టి శుక్రవారం అర్ధ రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఆయన అన్న కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి గమనించి తొగుట పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ లింగం ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని కిందకు దించారు. ఉత్తరాలను స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చేరదీసి.. కుటుంబసభ్యులకు అప్పగించి

- తప్పిపోయిన మహిళకు సఖి సెంటర్‌లో సపర్యలు
- వివరాలు సేకరించి సొంత గ్రామానికి పంపించిన వైనం


కుటుంబ సభ్యుల చెంతకు మహిళ

సిద్దిపేటకమాన్: హుస్నాబాద్ బస్టాండ్‌లో తిరుగుతున్న మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన ఓ మహిళను సిద్దిపేట సఖీ సెంటర్ సిబ్బంది చేరదీశారు. వైద్య సేవలు అందించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సఖీ సెంటర్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ బస్టాండ్‌లో ఓ మహిళ వారం రోజులుగా తిరుగుతుండగా స్థానిక యువకుడు గమనించి ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181కు కాల్ చేసి తెలిపాడు. హుస్నాబాద్ పోలీసు స్టేషన్‌కు ఆమెను తరలించారు. అక్కడి నుంచి మహిళను సిద్దిపేట సఖీ సెంటర్‌కు తీసుకెళ్లారు. ఆమెకు మూడు రోజులపాటు వసతి కల్పించడంతో పాటు వైద్య సహాయం అందించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యుల వివరాల గురించి ఆరా తీశారు. మహారాష్ట్ర, నాసిక్ జిల్లా చాంద్వాడ గ్రామంలోని రోహిదాస్‌నగర్ తమ ప్రాంతమని మహిళ తన వివరాలు తెలిపింది. దీంతో సఖీ సెంటర్ అడ్మిన్ ప్రతిమ నాసిక్ జిల్లా అడ్మిన్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితురాలి వివరాలు, ఫొటోలు పంపించారు. దీంతో నాసిక్‌కు చెందిన అధికారులు బాధితురాలి మరిన్ని వివరాలు తెలుసుకుని చాంద్వాడ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడ నెల క్రితమే మహిళ మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. వెంటనే బాధితురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె అన్నయ్య, వదిన స్థానిక పోలీసుల సాయంతో సిద్దిపేట సఖీ సెంటర్‌కు శనివారం వచ్చారు. వారికి మహిళను అప్పగించినట్లు సఖీ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు సఖీ సెంటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సఖీ సెంటర్ సిబ్బంది స్వరూపరాణి, శ్వేత తదితరులు ఉన్నారు.

ఒంటరితనం భరించలేక..

యువతి ఆత్మహత్య


ధనూజ(ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఒంటరితనం భరించలేక యువతి తనువు చాలించిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గూడెంకు చెందిన నూనె ధనూజ(21) రెండు నెలల క్రితం బ్రాంచ్ పోస్టు ఉమెన్‌గా ఉద్యోగం సాధించింది. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా చందుర్తి మండలం మర్రిగడ్డకు వచ్చింది. రెండు నెలలుగా మర్రిగడ్డలో అద్దె ఇంట్లో ఉంటూ విధులు నిర్వర్తిస్తుంది. ఈక్రమంలో వరుసకు బావ అయిన రాకేశ్‌ను ప్రేమిస్తుంది. ఒంటరితనంతో బాధపడుతున్నానని రాకేశ్‌తో చెప్పుకోగా.. ఉద్యోగానికి రాజీనామా చేసి రమ్మనడంతో గత నెల 31న రాజీనామా పత్రాన్ని సమర్పించింది. రెండు రోజులగా స్థానికంగా లేని ధనూజ శుక్రవారం మర్రిగడ్డలో అద్దెకుంటున్న ఇంటికి సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చింది. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతూనే తల తిప్పుతుందని చెప్పి ఫోన్ కట్ చేసింది. వెంటనే రాకేశ్ మర్రిగడ్డలోని తెలిసిన వ్యక్తులకు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. శనివారం తెల్లవారుజామున మర్రిగడ్డకు చెంది న మరొక వ్యక్తికి రాకేశ్ ఫోన్ చేసి ధనూజ ఇంటికెళ్లి చూసి రావాలని కోరాడు. సదరు వ్యక్తి వెళ్లి పిలువగా గదిలో నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇంటి పైకప్పు ఎక్కి చూడగా ఉరివేసుకొని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి నూనె మమత ప్రేమ వ్యవహారమే తన కూతురు మరణానికి కారణమని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

బైకును అడ్డగించి.. పురుగు మందు తాగించి..


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్

పాపన్నపేట(మెదక్): బైకుపై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి బలవంతంగా పురుగుల మందు తాగించిన సంఘటన మండలంలోని యూసుఫ్‌పేట్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. యూసుఫ్‌పేట్‌కు చెందిన రాజశేఖర్ వడ్రంగి పనులు చేస్తుంటాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం సున్నంబస్తా తీసుకురావడానికి కొత్తపల్లికి వెళ్తున్నాడు. గ్రామ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బైకును అడ్డుకుని రాజశేఖర్‌కు బలవంతంగా పురుగుల మందు తాగించారు. తప్పించుకొని గ్రామంలోకి వచ్చిన రాజశేఖర్‌ను స్థానికులు మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాజశేఖర్ తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మనుమడి పుట్టినరోజు వేడుకల్లో విషాదం

గుండెపోటుతో తాత మృతి


స్వామి గౌడ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): మనుమడి పుట్టిన రోజు వేడుకల్లో అప్పటివరకు ఆడిపాడిన తాతయ్య ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో నవ్వులు పూయాల్సిన పుట్టిన రోజు వేడుకల్లో విషాదం నిండింది. ఈ సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలబోయిన స్వామిగౌడ్(48) గీత కార్మికుడు. అతనికి భార్య సులోచన, ముగ్గురు కూతుళ్లు మౌనిక, లావణ్య, స్వాతి ఉన్నారు. ఇద్దరికి వివాహం చేశాడు. రెండో కూతురు లావణ్య, అల్లుడు వెంకట్‌గౌడ్ సిద్దిపేట మండలం రాంచంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు కన్నయ్య ఉన్నాడు. బాబు పుట్టినరోజు జరుపుకోవడానికి శుక్రవారం రాత్రి జంగపల్లికి వచ్చారు. ఈ వేడుకల్లో స్వామిగౌడ్ తన మనుమడితో డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

బుల్లెట్ బండి మీదపడి బాలుడు..


హేమంత్ రావల్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బుల్లెట్ బండి వద్ద ఆడుకుంటున్న క్రమంలో అది మీద పడి బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. నేపాల్‌కు చెందిన లక్ష్మణ్ రావల్ బతుకు దెరువు కోసం మూడేళ్ల క్రితం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు వచ్చాడు. సాయి భగవాన్ ఎన్‌క్లేవ్ వద్ద నివాసం ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. ఇతనికి కుమారులు హేమంత్ రావల్(03), భాస్కర్ ఉన్నారు. హేమంత్ 8వ తేదీన ఇంటి పక్కన ఉండే పురుషోత్తం బుల్లెట్ బండి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు అది మీద పడింది. తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స నిమిత్తం చందానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. బాలుడి తండ్రి లక్ష్మణ్ రావల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.